రెండు నూతన పోలింగ్ కేంద్రాలు

జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురణ

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత జిల్లాలో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎటువంటి మార్పులు లేవని, మొత్తం 287 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రెండు నూతన పోలింగ్ కేంద్రాలు పెరిగాయని, అదే విధంగా మూడు పోలింగ్ కేంద్రాల లొకేషన్ మారిందని, వాటి వివరాలను రాజకీయ పార్టీలకు తెలియజేస్తామని చెప్పారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టి సారించాలని తెలిపారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలను, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబరు 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, రమేశ్, బీఎస్పీ ప్రతినిధి ఎ.రమేశ్, భాజపా ప్రతినిధి రేగుల కనకయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంపత్, ఎంఐఎం ప్రతినిధి అహ్మద్ ఖాన్, భారాస ప్రతినిధులు రహీం, రాజన్న, తెదేపా ప్రతినిధి శంకర్‌గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ధర్మగుండంలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా తెప్పోత్సవం

వేములవాడ, న్యూస్‌టుడే: రాజన్న ఆలయంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సిద్ధిదా అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరి దేవికి చతుష్షష్టి పూజలు చేశారు. గాయత్రి జపం, చండీ హోమం, గాయత్రి హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు జరిపించారు. రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది.

భూగర్భ జలం.. సాగుకు బలం

నెల రోజుల వ్యవధిలో పెరిగినా గతేడాదితో పోల్చితే తగ్గుదలే

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

జిల్లాలో భూగర్భ జల మట్టాలు అటు ఇటుగా మారుతున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవగా నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో భూగర్భజల మట్టాలు కొద్దిమేర వృద్ధి చెందినప్పటికీ గతేడాది సెప్టెంబరుతో పోల్చితే 1.90 మీటర్లు పడిపోయాయి. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, అందుకు అనుగుణంగా భూగర్భ జలాలను భారీగా వినియోగించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో ఈ సంవత్సరం సెప్టెంబరు 6 వరకు 753 మిల్లీమీటర్ల సగటు వర్షపాతానికి గాను 915.7 మిల్లీమీటర్లు నమోదైంది. 22 శాతం ఎక్కువగా వానలు కురిశాయి.

- చందుర్తి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో అధిక వర్షపాతం నమోదవగా, రుద్రంగి, వేములవాడ గ్రామీణం, వేములవాడ, బోయినపల్లి, సిరిసిల్ల, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో వర్షాలు సాధారణానికి పరిమితమయ్యాయి.
- జిల్లాలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన చెరువులు 94, వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులు 539 మొత్తం కలుపుకొని 633 చెరువులకు గాను 213 చెరువులు మత్తడి పారాయి.
- 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న 39 చెరువులు, 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న 174 చెరువుల్లోని నీరు సైతం మత్తడి దూకి బయటకు వెళ్లిపోయింది.


నీటిని అందిస్తున్న బోరుబావి

ఎందుకీ వ్యత్యాసం

గతేడాది వానాకాలంలో అన్ని రకాల పంటలు కలుపుకొని 2,33,646 విస్తీర్ణంలో సాగవగా అందులో 1,81,507 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం 2,32,046 ఎకరాల విస్తీర్ణంలో సాగైన వివిధ రకాల పంటల్లో 1,79,672 ఎకరాలతో వరి మొదటి స్థానాన్ని ఆక్రమించింది.


- గత సంవత్సరం వానాకాలం పూర్తయ్యే నాటికి జిల్లాలో 1,061.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అప్పటికే నీటి వనరుల్లో సమృద్ధిగా సాగునీరు ఉండటం వల్ల భారీ వర్షాలు తోడవడంతో చెరువులు, కుంటలన్నీ పూర్తిగా నిండిపోయాయి.
- సాధారణంగా నీటి వనరుల నుంచి యాసంగి సీజన్‌లో ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేస్తుంటారు. గతేడాది వానాకాలం సీజన్‌లోనే పంటలకు సాగునీటిని వదిలారు.
- ప్రధాన, పంట కాల్వల గుండా సమృద్ధిగా నీరు పారడంతో అన్నదాతలు వ్యవసాయ విద్యుత్తు మోటార్లు నడపడాన్ని నిలిపివేశారు. ఈ ఏడాది ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతో పంపుసెట్లను నిరంతరాయంగా నడిపించారు.
- వర్షాలు కూడా రోజుల తరబడి విరామమిస్తుండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ కరెంటు మోటార్లను నడపాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో గతేడాది కంటే ఈ సారి వరిసాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ 2023 సెప్టెంబరు, 2024 సెప్టెంబరుతో పోల్చితే జిల్లా సగటు భూగర్భజల మట్టాల్లో 1.90 మీటర్ల తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది.

ఎల్లారెడ్డిపేటలో అత్యధిక లోతున పాతాళగంగ

గత నెలలో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 5.76 మీటర్లలో ఉండగా ఎల్లారెడ్డిపేట మండలంలో 11.45 మీటర్ల లోతుకు వెళ్లాయి. రుద్రంగి మండలంలో 1.60 మీటర్ల అత్యల్ప లోతులో భూగర్భ జలాలు లభిస్తున్నాయి.

మండలాల వారీగా సగటు భూగర్భజల మట్టాల వివరాలు (మీటర్లలో)

మండలం	సెప్టెంబరు (2023)	సెప్టెంబరు (2024)
బోయినపల్లి	2.68	2.94
చందుర్తి	1.41	2.93
గంభీరావుపేట	5.55	6.70
ఇల్లంతకుంట	3.28	3.50
కోనరావుపేట	4.02	5.95
ముస్తాబాద్	2.37	6.35
రుద్రంగి	1.55	1.60
ఎల్లారెడ్డిపేట	1.38	11.45
వేములవాడ అర్బన్	10.11	3.35
వేములవాడ గ్రామీణం	1.55	3.74
సిరిసిల్ల	5.35	10.28
తంగళ్లపల్లి	4.70	4.00
వీర్నపల్లి	5.11	7.92


రాచర్ల బొప్పాపూర్‌లో కళాకారుల ప్రదర్శన


దుర్గాదేవి శోభాయాత్ర

ఘనంగా దుర్గాదేవి నిమజ్జన వేడుకలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో దుర్గామాత ఉత్సవ కమిటీ, దుమాలలోని నవదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ప్రతిష్ఠించిన దుర్గాదేవి నిమజ్జన వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి విగ్రహాల శోభాయాత్రను వైభవంగా జరిపారు. రాచర్ల బొప్పాపూర్‌లో కళాకారుల బృందం ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. విద్యుత్తు దీపాల సెట్టింగుల నడుమ కళాకారులు తమ ఆటపాటలతో అలరించారు. అమ్మవారికి మహిళలు మంగళ హారతులు సమర్పించారు. కార్యక్రమంలో కమిటీల సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


దుమాలలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ యువతలో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీయడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడుస్తూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకొంటున్నారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే సిరిసిల్లకు రూ.50 కోట్లతో నూలు డిపో, రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు కప్పుతోపాటు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, కౌన్సిలర్ గెట్యాల శ్రీనివాస్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు కప్పు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ తదితరులు

భాజపా ఎడ్ల బండ్ల ప్రదర్శన

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో భాజపా నాయకులు దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంతోష్‌బాబు, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం, నాయకులు కుమ్మరి శంకర్, బాల్‌రాజు, రాజ్‌కుమార్, హన్మాండ్లు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అకాల వర్షంతో నేలవాలిన వరి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన బోడ పట్ల అంజయ్య అనే రైతుకు చెందిన వరి పంట గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి నేలపాలైంది. కోతకు వచ్చిన రెండు ఎకరాల వరి పంట అకాల వర్షంతో నేలవాలడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండగ తర్వాత వరి కోస్తామనుకున్న సమయంలో అకాల వర్షంతో పంట నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని అంజయ్య కోరారు.


పంటను చూపిస్తున్న రైతు అంజయ్య

దశ తిరగాలి.. విజయం అందాలి..

సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలి



ఈనాడు, కరీంనగర్

దసరా పండుగ.. విజయానికి ప్రతీక.. ఆత్మవిశ్వాసమే ఆయుధపూజగా విజయ మార్గంలో నడిచేవారికి.. శక్తియుక్తులను కూడగట్టుకుని లక్ష్యం దిశగా అడుగులు వేసేవారికి.. ఏదైనా పనికి శ్రీకారం చుట్టడానికి ఈ పండుగను మించిన మంచి రోజు మరొకటి ఉండదు. ఇదే రోజున శమీ వృక్షాన్ని పూజించిన రాముడు రావణుడిపై గెలిచాడు. దుర్గాదేవి మహిషాసురుడిని యుద్ధంలో ఓడించింది. పాండవులు జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాల్ని దింపి వాటితో పోరాటానికి వెళ్లి విజేతలుగా నిలిచారు. ఇదే ఆశతో ఆకాంక్షతో ఉమ్మడి జిల్లావాసులు విజయపథాన నడిచేందుకు సిద్ధమవ్వాలి.. మది నిండుగా శక్తిని నింపుకొని.. సంకల్పాన్ని కూడగట్టుకుని గెలుపు తీరానికి చేరుకోవాలి..

రైతన్నా భిన్నంగా సాగు..



వానాకాలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.82 లక్షల మంది అన్నదాతలు దాదాపుగా 10లక్షల కుపైగా ఎకరాల్లో పంటలు సాగు చేశారు.. ఇందులో అధిక శాతం వరి పంటే వేశారు. ఇక్కడి భూములు కూరగాయలు, వాణిజ్య పంటల సాగుకు అనుకూలమైనా వరిపైనే ఆధారపడుతున్నారు. విజయ దశమి తరువాత యాసంగి సాగు ప్రారంభమవుతుంది. ఇప్పుడైనా కొత్త పంటలు, కొత్త విధానాలతో సాగితే అటు రైతన్నకు.. ఇటు ప్రజలకు మేలు జరుగుతుంది. కూరగాయల సాగు తగ్గి దిగుమతులు లేనప్పుడు అధిక ధరలకు జనం బెంబేలెత్తుతున్నారు. చిరు ధాన్యాల వినియోగంపై ఆసక్తి పెరిగినా ఇక్కడి సాగు లేక ధరలు సామాన్యులకు అందడం లేదు. అధికారులు ఉమ్మడి జిల్లాలో ఏ పంటల సాగు తగ్గడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. వాటి సాగు వల్ల కలిగే మేలుపై అవగాహన కల్పిస్తే రైతులకు, ఉమ్మడి జిల్లావాసులకు ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడం అవసరం.

నైపుణ్య ప్రాప్తిరస్తు



యంగ్ ఇండియా, నైపుణ్యాభివృద్ధిని యువతకు అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలు అందిపుచ్చుకోవాలి. 'యంగ్ ఇండియా'లో భాగంగా సమీకృత గురుకులాలను ఒక రోజు ముందే మంథని, మానకొండూరు నియోజకవర్గాల్లో ప్రారంభించడం శుభ పరిణామం. త్వరలోనే జిల్లాకో కొత్త నైపుణ్య శిక్షణ కేంద్రం, టాస్క్ కేంద్రాలు, ఐటీఐలు ఏర్పాటవనుండటం యువత భవితకు మంచి రోజులనే సంకేతాలిస్తున్నాయి. 38 లక్షల జనాభాలో ఇంటర్ ఆపై విద్యార్హతలున్న వారు దాదాపుగా 3.50లక్షల వరకుంటారు. ప్రస్తుతం ఎంత చదివామన్నది కాదు.. ఎన్ని నైపుణ్యాలున్నాయన్నది ముఖ్యమని యువత గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను ఉపయోగించుకోవడంతోపాటు తాము సొంతంగా ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవడంపై దృష్టి పెడితేనే ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదగగలమన్న విషయాన్ని గుర్తించాలి. స్వయం ఉపాధితో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడంపై యువత దృష్టి పెట్టినప్పుడే నిరుద్యోగ సమస్య దూరమవుతుంది.

రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా..



ఎన్నో ఏళ్ల కష్టం ఫలించింది.. దసరా తరవాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 800 మందికిపైగా ఉపాధ్యాయులు బడుల్లో అడుగు పెట్టనున్నారు. కలల కొలువు సాధించిన వీరు రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా సాగాలి. మంచి బోధనతోపాటు నైతిక విలువలు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రతువు ప్రారంభించాలి. మరోవైపు పోలీసు శిక్షణను పూర్తిచేసుకున్న వారు కొందరు జిల్లాలో అడుగు పెట్టగా.. ఇంకొందరూ ఈ పండుగ తరువాత కొత్త కొలువుల్లో కొలువుదీరనున్నారు. సామాన్యులకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు లక్ష్యమైతేనే ఆ దుస్తులకు సార్థకత లభిస్తుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

మహిళా వికాసం..



42వేలకుపైగా స్వయం సహాయక సంఘాల్లోని 5.86 లక్షల మంది మహిళామణులను స్వయం ఉపాధిలో రాణించేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. ఆ అవకాశాలను ఒడిసిపట్టుకుని విజయం దిశగా సాగాలి. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రుణాల సహకారం ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి. మహిళా శక్తి ద్వారా భిన్న వ్యాపారాలు స్థాపించి స్వయం ఉపాధి పొందాలి. 61 మండలాల్లో ఒక్కో మహిళా సంఘానికి అద్దె బస్సు నిర్వహణ బాధ్యతను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మున్ముందు ఆర్థిక స్వావలంబన దిశగా రెట్టింపు ఉత్సాహంతో అతివలు అడుగేయడానికి దసరా వేదిక కావాలి.

కలల కొలువు సాధించండి



ఈ నెలలో నిర్వహించే గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో విజయం సాధించే దిశగా నాలుగు జిల్లాల్లో దాదాపుగా 4-5 వేల మంది రోజూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూప్స్ పోటీ పరీక్షలతోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను దాదాపుగా 1.24 లక్షల మంది రాశారు. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను ఈ ఏడాదిలోనే దాదాపుగా 55 వేల మంది రాయబోతున్నారు. పోలీసు కానిస్టేబుళ్ల నియామకం కోసం కుర్రకారు సిద్ధమవుతున్నారు. విజయ దశమి స్ఫూర్తిగా ఇష్టంగా కష్టపడితే కలల కొలువు సాధించడం పెద్ద కష్టమేం కాదని గుర్తించండి.

విద్యకు అధిక ప్రాధాన్యం : దుద్దిళ్ల



పాఠశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. ప్రతీ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో 25 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'కు ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. వచ్చే నెల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. సమీకృత పాఠశాలల్లో కులమత భేదాలు ఉండవని.. అందరికీ సమానంగా విద్య అందించాలనే భావనతో రాష్ట్రంలో ఒకేసారి 28 పాఠశాలలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. సోమన్‌పల్లి పాఠశాలలో 2026 వరకు భవనాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో మొట్టమొదట అడ్మిషన్లు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష, మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బోధనే లక్ష్యం : పొన్నం

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం కులం, మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేసిందని.. వాటికి అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకులాలను నిర్మించబోతున్నట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లిలో శుక్రవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసినవి తాము 10 నెలల్లో చేసి చూపించామన్నారు. అర్హత ఉండి రుణమాఫీ కాకపోతే అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు విద్యతోనే తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, నాయకులు రమణారెడ్డి, ఎస్‌ఎల్ గౌడ్, శ్రీనివాస రావు, రాము, లక్ష్మారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి తదితరులు

బస్సు డ్రైవర్‌కు మూర్ఛ.. అప్రమత్తతతో తప్పిన ముప్పు

కరీంనగర్ రవాణా విభాగం, న్యూస్‌టుడే: బస్సు చోదకుడికి మూర్ఛ రావడంతో అప్రమత్తమైన ఆయన బస్సును ఆపేసిన ఘటన కరీంనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు (నాన్‌స్టాప్) కరీంనగర్ బస్టాండ్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా గీతా భవన్ చౌరస్తాలో డ్రైవర్‌కు మూర్ఛ వచ్చింది. అప్రమత్తమైన ఆయన ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం డ్రైవర్‌ను 108కు ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు. అందులో మరో డ్రైవర్ ఉండటంతో అతను బస్సును తిరిగి కరీంనగర్ బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. ఈ ఘటన సమయంలో బస్సులో 20 మంది వరకు ఉన్నారని, వారంత సురక్షితంగా ఉన్నారని ఏటీఎం గుండా సురేశ్ తెలిపారు. డ్రైవర్ క్షేమంగానే ఉన్నారన్నారు.

అనర్హుల గుర్తింపు.. 5,819 పేర్ల తొలగింపు

ప్రతి నెలా డీలర్ల వారీగా వివరాలు సేకరణ ■ రేషన్ కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి

న్యూస్‌టుడే, హుజూరాబాద్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డుల్లోంచి అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. మరణించిన వారు, వివాహం జరిగి అత్తారింటికి వెళ్లిన వారు, స్థానికంగా లేని వారికి బియ్యం పంపిణీ నిలిపి వేయాల్సిందిగా పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. ప్రతి నెలా డీలర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ అనర్హులను గుర్తిస్తున్నారు. పక్కదారి పడుతున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేసేందుకే అనర్హులకు బియ్యం పంపిణీ నిలిపి వేసేలా ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

■ ఉమ్మడి జిల్లాలో గత ఫిబ్రవరిలో 9,78,595 రేషన్ కార్డులు ఉండగా 28,13,951 మంది లబ్ధిదారులు ఉన్నారు.

■ అదే అక్టోబరు వచ్చే సరికి 9,77,409 రేషన్ కార్డుల్లో 28,08,132 మంది లబ్ధిదారులున్నారు. ■ తొమ్మిది నెలల వ్యవధిలోనే 1,186 రేషన్ కార్డులను రద్దు చేసి 5,819 మంది లబ్ధిదారుల పేర్లు తొలగించారు. ■ కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 1,075 రేషన్‌కార్డులు రద్దు చేసి 4,192 మంది పేర్లు తొలగించారు. జగిత్యాలలో 787, పెద్దపల్లిలో 406, రాజన్న సిరిసిల్లలో 434 మంది పేర్లు తొలగించారు. ■ ప్రతి నెలా రేషన్ డీలర్ల వారీగా నివేదికలు తెప్పించుకుంటున్న పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యుల్లో మరణించిన వారు, స్థానికంగా లేని వారిని గుర్తించి వారి పేర్లను తొలగిస్తున్నారు. ■ తొలగించిన వారిలో కొందరు అర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తుండగా, అలాంటిదేమీ లేదని అధికారులు చెబుతున్నారు. ■ అనర్హుల పేర్లు తొలగించిన పౌరసరఫరాల శాఖ ఈ నెలలో 31.721 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువ చేసి కేటాయించారు.

తొమ్మిది నెలల్లో వ్యత్యాసం ఇలా..

	ఫిబ్రవరి		అక్టోబరు	
జిల్లా	కార్డులు	లబ్ధిదారులు	కార్డులు	లబ్ధిదారులు
కరీంనగర్	2,77,993	8,08,916	2,76,918	8,04,724
జగిత్యాల	3,07,158	8,82,495	3,07,100	8,81,708
పెద్దపల్లి	2,19,677	6,25,090	2,19,663	6,24,684
సిరిసిల్ల	1,73,767	4,97,450	1,73,728	4,97,016



3,46,884 మంది ఈ-కేవైసీకి దూరం


అర్హులకే బియ్యం అందేలా ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఈ-కేవైసీ ప్రక్రియ చేయకుంటే వారి పేర్లను రేషన్ కార్డుల్లోంచి తొలగించేలా నిబంధన విధించింది. ఇందుకోసం గత నెల 30 వరకు విధించిన గడువును ప్రభుత్వం డిసెంబరు 31 వరకు పొడిగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,08,132 లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు 24,61,248 మంది మాత్రమే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ నవీకరణ లేకపోవడం, చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం, పెళ్లైన యువతులు అత్తారింటికి వెళ్లిపోవడం, కొంత మంది ఉన్నత చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, ఉద్యోగులు స్థానికంగా ఉండకపోవడం తదితర కారణాలతో 3,46,884 మంది ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. డిసెంబరు 31 లోపు రేషన్ కార్డుల్లో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారుడు డీలర్లను సంప్రదించి ఈ-కేవైసీ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలని, లేని పక్షంలో బియ్యంతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగ రావు స్పష్టం చేశారు.

అయిదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు

జగిత్యాల వ్యవసాయం : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వద్ద, గాలిలో తేమ 65-93 శాతం వరకు నమోదు అవుతుందని చెప్పారు.

విజయదశమి శుభాకాంక్షలు

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ దుర్గాభవానీ అమ్మవారి ఆశీర్వాదంతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో ఈ సంవత్సరం ప్రారంభించే అన్ని పనుల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



వార్డుల వారీగా వివరాలు

మీ చేతిలోనే ఓటరు జాబితా

సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితా తయారు చేసింది. వార్డుల వారీగా ఓటర్ల వివరాలతో సిద్ధం చేసింది. గత నెలలో ముసాయిదా విడుదల కాగా అభ్యంతరాల స్వీకరణ తర్వాత సెప్టెంబర్ 28న తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.

చరవాణిలో చూడొచ్చు...

సాధారణ పౌరులు సైతం ఓటరు జాబితాను చూసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందుకోసం చరవాణి లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా tsec.gov.in అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఫైనల్ రోల్స్ జీపీ అనే మరో ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు ఎంచుకోవాలి. గ్రామానికి సంబంధించిన ఓటర్ల వివరాలు వార్డుల వారీగా కనిపిస్తాయి. ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, అందులో మహిళలు, పురుషుల సంఖ్య కనిపిస్తుంది. పక్కనే తెలుగు, ఆంగ్ల భాషలో జాబితా పూర్తి వివరాలతో ప్రత్యక్షమవుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)

వీర్నపల్లి: 91541 18151

బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే – ముస్తాబాద్

? ముస్తాబాద్ శివారు ఎగువ మానేరు కాల్వ కట్ట తూముకు మరమ్మతులు చేపట్టాలి. - రాజు, రైతు

✔ తూముల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. - రాజు, నీటిపారుదలశాఖ పర్యవేక్షకుడు

నేర వార్తలు

విద్యుదాఘాతంతో రైతు మృతి



మనోహర్‌రావు

కొలనూర్ (కోనరావుపేట), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందగా, పండగ పూట గ్రామంలో విషాదం నెలకొన్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల వివరాల ప్రకారం... కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన రైతు పుసుగోటి మనోహర్‌రావు (46) వాటర్ ట్యాంకు ద్వారా ఇంటి అవసరాల కోసం నీటిని సంపులోకి సరఫరా చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెంటనే సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. పండగ పూట రైతు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య సుష్మా, కుమార్తెలు సిరి, సంజన, తల్లిదండ్రులు దామోదర్‌రావు, విజయ ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

ఇద్దరికి గాయాలు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన వీర్నపల్లి మండలం రంగంపేట శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన బానోతు రాజునాయక్ తన మనవరాలిని వట్టిమల్లలో వదిలిపెట్టేందుకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద సిరిసిల్ల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణాలకు ప్రమాదం తప్పింది. రాజు కాలికి తీవ్ర గాయాలు కాగా బాలికకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మరో ఘటనలో ఒకరికి...

ముస్తాబాద్: ద్విచక్ర వాహనదారుడికి గాయాలైన సంఘటన ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. వాహనదారుల కథనం మేరకు... ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శంకర్ ముస్తాబాద్‌కు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా ఎడమ కాలుకు గాయాలయ్యాయి. అత్యవసర వాహనానికి సమాచారం అందించగా హుటాహుటిన చేరుకొని బాధితుడిని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు 108 వాహన సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న బంధువులు ఆసుపత్రికి చేరుకున్నట్లు వెల్లడించారు.

చోరీకి గురైన వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం రాత్రి చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు 24 గంటల్లోగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన గడ్డం జగన్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని సీసీ కెమెరాల ఆధారంగా ద్విచక్రవాహనంతోపాటు చోరీకి పాల్పడిన సిరిసిల్ల పట్టణానికి చెందిన ఓ యువకుడిని గుర్తించినట్లు సమాచారం.

వేములవాడలో వ్యభిచార నిర్వాహకుడి అరెస్టు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని అయ్యప్పకాలనీ ఎదురుగా మెయిన్‌రోడ్డు పక్కన ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పట్టణ ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారంతో ఇంటిపై దాడి చేయగా పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ మహిళతో మల్లె రత్నయ్య వ్యభిచారం చేయిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. అతని వద్ద కండోమ్, బెడ్ షీట్లు, రూ.2 వేల నగదు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రత్నయ్య స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా కాగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన మహిళను నెల్లూరుకు రప్పించి అక్కడి నుంచి వేములవాడకు తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. పట్టుబడిన మహిళను సఖి కేంద్రానికి తరలించి, వ్యభిచారం నిర్వహిస్తున్న రత్నంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కంపుకొడుతున్నా పట్టదా?

న్యూస్‌టుడే, ముస్తాబాద్

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో మూత్రశాలల నిర్వహణను గాలికి వదిలేశారు. వాటి నుంచి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో నిత్యం మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళల బాధలు వర్ణనాతీతం. అధ్వానంగా మారిన మూత్రశాలలపై ప్రత్యేక కథనం.



ముస్తాబాద్‌లో తలుపులు లేకుండా మూత్రశాలలు

మూత్రశాలల నిర్వహణపై దృష్టిసారిస్తే మేలు

ముస్తాబాద్ మండల కేంద్రంలో 8,665 మంది జనాభా ఉన్నారు. మండల కేంద్రంలో మురుగు కాల్వపై పురుషులు, స్త్రీల కోసం మూత్రశాలలు నిర్మించారు. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో రెండు గదులకు ఏర్పాటు చేసిన తలుపులు ఊడిపోయాయి.

- స్త్రీల గదికి తలుపు లేకపోవడంతో అందులోకి వెళ్లేందుకు జంకుతున్నారు. అత్యవసర సమయాల్లో వెళ్లక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గదుల్లో మద్యం ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి.
- రన్నింగ్ వాటర్ లేదు. పైన ఏర్పాటు చేసిన ట్యాంకులో నీరు లేక అలంకారప్రాయంగా మారింది.



సంతలో క్రయ, విక్రయదారులు

వార సంత సమయంలో...

మండల కేంద్రంలో ప్రతి ఆదివారం కామారెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారి డివైడర్‌కు ఓ వైపు గ్రామ పంచాయతీ కార్యాలయం మొదలుకొని నూతన బస్టాండ్ వరకు వార సంత నిర్వహిస్తుంటారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు వార సంతకు వస్తుంటారు.

- మూత్ర శాలలు కంపుకొడుతుండటంతో సంతకు వచ్చేవారు అందులోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని మండల కేంద్రంలో కొత్తవి కట్టాలని కోరుతున్నారు. మురుగు కాల్వపై ఉన్న మూత్రశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తలుపులు బిగించాలి



మండల కేంద్రానికి నిత్యం ఏదో ఒక పనిపై వివిధ గ్రామాల ప్రజలు వచ్చిపోతుంటారు. పాత బస్టాండ్ సమీపంలో తాత్కాలికంగా నిర్మించిన మూత్రశాల దుర్గంధంగా మారింది. కంపు కొడుతుండటంతో అందులోకి వెళ్లలేకపోతున్నారు. గదులకు ఏర్పాటు చేసిన తలుపులు ఊడిపోయాయి. మహిళలు అందులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకొని వాటికి తలుపులు బిగించాలి. నిర్వహణపై దృష్టిసారించాలి. - ఎదునూరి గోపి, స్థానికుడు

ప్రత్యేక దృష్టి సారిస్తాం



మూత్రశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడరు వేయిస్తున్నాం. రన్నింగ్ వాటర్ వచ్చేలా చర్యలు చేపడతాం. మూత్రశాలల గదులకు త్వరలోనే తలుపులు బిగిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్తవి నిర్మాణానికి కృషి చేస్తాం. - రమేశ్, ఈవో, ముస్తాబాద్

పులి సంచారంతో అన్నదాతల్లో భయాందోళన

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్- రామోజిపేట పరిసరాల్లోని సోలార్ ప్లాంటు వద్ద శుక్రవారం పులి సంచరించిన వీడియో వైరల్ కావడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పులి తిరుగుతున్న వీడియోను రైతులు చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పెట్టడంతో అది వైరల్ అయింది. అది అటవీ సంచరించి గుట్టల్లోకి వెళ్లినట్లు రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దసరాకు సిద్ధమైన మహిషాసురమర్దని కటౌట్

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో దసరా రోజు దహనానికి మహిషాసురమర్దిని కటౌటును సిద్ధం చేశారు. ఏటా మహిషాసురమర్దని దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. దీని పొడవు 24, అడ్డం 8 అడుగులు ఉన్నట్లు పేర్కొన్నారు.



తంగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన కటౌట్

దుర్గాదేవికి పూజలు.. హోమాలు

శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



చందుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు



రాచర్ల బొప్పాపూర్‌లో...



ఎల్లారెడ్డిపేటలో మహిషాసురమర్దనిగా అలంకరణ



ధర్మారంలో...



తడగొండలో చండీ హోమం



మానాలలో...



కనగర్తిలో...



పోత్గల్‌లో...



రాచర్ల గొల్లపల్లి: అమ్మవారి సన్నిధిలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు



వీర్నపల్లిలో...



గంభీరావుపేటలో...



ముస్తాబాద్‌లో...

ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని జిల్లా సంక్షేమశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలిక దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మలాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

కనగర్తి (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం కనగర్తి బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ విష్ణుకుమార్‌ను నాయకులు, ఖాతాదారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. మెరుగైన సేవలు అందించి ఖాతాదారుల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కోనరావుపేట పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి, మాజీ సర్పంచి బాపురెడ్డి, డెయిరీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు సాగర్, లచ్చిరెడ్డి, గంగారెడ్డి, వంగపల్లి దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9 రోజులపాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక పశువుల సంత నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కవాతు కొనసాగింది. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, భాజపా నాయకులు, హిందూ ధర్మ రక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల పంపిణీ

నిజామాబాద్ (కోనరావుపేట): కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన 30 మంది కళాకారులకు సుమారు రూ.25 వేల విలువైన డప్పులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లంబ రాజు, జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్, నాయకులు ముత్యాల శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజయ్య, తిరుపతిరెడ్డి, శోభన్‌బాబు, బాలయ్య, మనోహర్, కల్యాణ్, లింగం, చిరంజీవి పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతీరావు, అర్చకుడు కృష్ణమాచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం



పోత్గల్‌లో ఏఎంసీ పాలకవర్గ సభ్యులకు సత్కారం

పోత్గల్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: అన్నదాతకు అండగా ఉంటామని ఏఎంసీ ఛైర్‌పర్సన్ తలారి రాణి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ ఏఎంసీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఛైర్‌పర్సన్‌తోపాటు వైస్ ఛైర్మన్ వేల్పుల రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. అనంతరం పాలకవర్గాన్ని పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, నాయకులు రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కళలు, సంస్కృతిని కాపాడుకోవాలి



సుద్దాలలో కళాకారుల ప్రదర్శన

సుద్దాల (కోనరావుపేట), న్యూస్‌టుడే: కళలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల ఉన్నత పాఠశాల మైదానంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, పెరల్స్ ఆర్ట్ క్రియేషన్స్ డైరెక్టర్ సుంకరి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన బతుకమ్మ బోనాల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ కళలు, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన యువతులు, మహిళలు ఇచ్చిన కళా ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచి దేవలక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీలు ఎల్లయ్య, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాషా, నాయకులు ఉప్పుల ఆంజనేయులు, గంగయ్య, ఎర్రవెల్లి నాగరాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మెట్ల నిర్మాణానికి భూమిపూజ

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని చిన్నాన్న పెద్దన్న ఆలయం మెట్ల నిర్మాణానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం భూమిపూజ చేశారు. స్వామివారిని దర్శించుకోవటానికి సౌకర్యంగా దాతలు, గ్రామస్థుల సహకారంతో మెట్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలు కలిసి కట్టుగా ఉంటే గ్రామాభివృద్ధికి బాటలు పడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, నాయకులు రాంరెడ్డి, మల్లారెడ్డి, అమృతరావు, ఎల్లారెడ్డి, సాగర్, శ్రీనివాస్, కిట్టు, రాములుగౌడ్, గోపాల్, మహేందర్, అర్చకుడు కృష్ణహరి పాల్గొన్నారు.

అల్మాస్‌పూర్‌లో రేషన్ దుకాణం ప్రారంభం



రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం ఏఎంసీ ఛైర్‌పర్సన్ సాబేరాబేగం, నాయకులతో తహసీల్దారు రాంచందర్

అల్మాస్‌పూర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో నూతనంగా మంజూరైన చౌకధరల దుకాణాన్ని రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, నాయకులతో కలిసి తహసీల్దారు రాంచందర్ శుక్రవారం ప్రారంభించారు. తూకం యంత్రాన్ని పరిశీలించి, వినియోగదారులకు సక్రమంగా సరకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, వైస్ ఛైర్మన్ గుండాటి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ సర్పంచి రాధారపు పుష్పలత, నాయకులు షేక్ గౌస్, చక్రధర్‌రెడ్డి, రాజయ్య, కిషన్‌రావు, అంజన్‌రావు, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా ఎంపికైన యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన కన్నం జనార్దన్ ఇటీవల ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. దీంతో యువకుడిని గ్రామస్థులు శాలువాతో సత్కరించారు. తిరుపతి, రవి, రఫీ, విష్ణు, అశోక్, రతిలాల్, జలేందర్, కృష్ణ, మహేందర్ పాల్గొన్నారు.

దసరా నాడు డ్రంకెన్ డ్రైవ్

తంగళ్లపల్లి: మండలంలో దసరా పండగ సందర్భంగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. మండల ప్రజలు ఎవరూ మద్యం తాగి వాహనాలు నడపరాదని తెలిపారు.

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయురాలి మృతి

వేములవాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉర్దూ మాధ్యమం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని (56) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆమె భర్త పవన్‌కుమార్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. సుహాసినికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

లస్మవ్వ పాటలు తెలంగాణకే ఆదర్శం



ఆవునూర్‌లో పాటల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రమేశ్ తదితరులు

ఆవునూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: లస్మవ్వ పాడిన పాటలు తెలంగాణకే ఆదర్శమని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన జనపాల శంకరయ్య తల్లి లస్మవ్వ పాడిన బతుకమ్మ పాటల పుస్తకాన్ని స్వగ్రామంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. శంకరయ్య తన తల్లి లస్మవ్వ పాడిన సద్దుల బతుకమ్మ పాటలను రచించి పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. లంబాడీ సాహిత్యంపై పీహెచ్‌డీ చేయడం ఆయన గొప్పదనం అంటూ కొనియాడారు. అనంతరం లస్మవ్వను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుండం నర్సయ్య, ఎస్సై గణేశ్, సీనియర్ సిటిజన్స్ సంఘం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు క్రాంతి, నక్కదాసరి రవి, కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.